

నేడు పాఠశాలలకు సెలవు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లావ్యాప్తంగా ఈ నెల 14న పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుకున్నట్లు తెలిపారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు విధిగా ప్రభుత్వ ఆదేశాలను పాటించి, సహకరించాలని పేర్కొన్నారు.



ఆలయాల్లో పూజలు చేస్తున్న కల్హేర్ మండలంలోని మార్డి గ్రామస్థులు

వానలు కురవాలి వరుణ దేవుడా!

- 11 గ్రామాల ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కల్హేర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : ఏంటి వర్షాల కోసం పూజలా?.. అని అనుకుంటున్నారా?.. అవును రాష్ట్రంలో ఎక్కడ చూసినా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కానీ ఇక్కడ మాత్రం ముసురు, మబ్బులు మాత్రమే ఉంటున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిపించి పంటలు బాగా పండాలని, ఇకనైనా దేవుళ్ల మా మొర విని వర్షాలు కురిపించాలని మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ప్రజలు వేడుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 11 గ్రామాల్లోని ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, జలాభిషేకం చేసి భజనలు చేశారు. మరి ఇప్పటికైనా ఆ దేవుళ్ల కరుణించి ఉమ్మడి కల్హేర్ మండలంలోని గ్రామాలపై వర్షాలు కురిపించాలని కోరుకుందాం.

మెదక్ జిల్లాకు రెడ్ అలర్ట్


- 72 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్ష సూచన
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

మెదక్ అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ మెదక్ జిల్లాకు రెడ్ అలర్ట్‌ను జారీ చేసిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ రానున్న 72 గంటల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. క్షేత్రస్థాయిలో కార్యదర్శి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగుల సెలవులు రద్దు చేశామన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నారు. ప్రభుత్వ యంత్రాంగం యావత్తు అండగా ఉందనే భరోసాను ప్రజలకు కల్పించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి సమస్యలున్నా ప్రజలు 9391942254 నంబర్ ద్వారా కంట్రోల్ రూం కాలం చేయాలన్నారు

సింగూరు ప్రాజెక్టుకు భారీ వరద

- గరిష్ఠ స్థాయి నీటి మట్టానికి చేరువ
- దిగువకు విడుదల

పుల్‌కల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టు నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువలో ఉన్నది. పూర్తి స్థాయి నీటి నిల్వతో ప్రాజెక్టు ఆనకట్టకు ప్రమాదం పొంచి ఉన్నదంటూ ఇటీవల ఆనకట్ట భద్రత కమిటీ నివేదిక అందజేసిన నేపథ్యంలో నీటి పారుదల శాఖ అధికారులు అప్రమత్తయ్యారు. ఈ మేరకు బుధవారం రాత్రి 7 గంటలకు 11వ నంబరు క్రస్టుగేట్‌ను 1.5 మీటర్లు ఎత్తి నీటిని దిగువన ఉన్న మంజీర జలాశయానికి వదిలారు. జల విద్యుత్ ఉత్పత్తిలోని ఒక గేటు ద్వారా 1,265 క్యూసెక్కులు, 11 నంబరు క్రస్టుగేట్ ద్వారా 7,694 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, ఇప్పటికే 22.284 టీఎంసీలకు చేరింది. ఇన్ ఫ్లో 4,336 క్యూసెక్కులు నమోదవగా, అవుట్ ఫ్లో 8,959 క్యూసెక్కులుగా నమోదయింది. వరద నీరు విడుదలవుతుండటంతో దిగువన మంజీర నది పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పుల్కల్, చౌటకూర్ మండలాల తహసీల్దార్లు కృష్ణ, అనుదీప్‌లు కోరారు. మత్స్యకార్మికులు చేపల వేటకు, గొర్రెలు, పశువుల కాపరులు నది తీర ప్రాంతానికి నది తీర ప్రాంతం వైపునకు వెళ్లవద్దని సూచించారు.



వాగులు ఫుల్.. దారులు బంద్

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
- గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలకు ఆదేశాలు

జహీరాబాద్ డివిజన్‌లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. లోలెవల్ వంతెనలు ఉన్న చోట్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులే రోడ్లను మూసివేశారు. యూసుఫ్‌గూడ శివారులో వాగు దాటుతూ ఒకరు మృత్యువాత పడిన నేపథ్యంలో బుధవారం వాగు దాటకుండా బారీకేడ్లను ఏర్పాటు చేశారు. గ్రామ శివారులో ఎక్స్‌కవేటర్, ముళ్ల కంచెలను ఏర్పాటు చేశారు.

జహీరాబాద్‌ను వెంటాడుతున్న వాన కష్టాలు



జహీరాబాద్ మండలం రాయిపల్లి బ్రిడ్జి వద్ద నారింజప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా అధికారులు అప్రమత్తమయ్యారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఎస్పీతోపాటు ఇతర ఉన్నతాధికారులు ప్రాజెక్టులు, వరద ప్రభావిత ప్రాంతాలను బుధవారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని అధికారులు సూచించారు.

కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్‌ల సమీక్ష

జహీరాబాద్‌లో కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ సంయుక్తంగా వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించారు. నారింజ నది ప్రవాహాన్ని, బూచనెల్లి-గణపూర్ మధ్య ఉన్న అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రవహిస్తున్న వరదనీటిని వారు పరిశీలించారు. ప్రజలు నదులు, వాగులు, చెరువులు, బ్రిడ్జిల వద్దకు వెళ్లవద్దని, విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని వారు సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు మానుకోవాలని, ఏదైనా సహాయం కావాలంటే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155 ఫోన్ చేయాలని ప్రజలకు తెలిపారు. అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, క్షేత్రస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు చేరవేయాలని ఆదేశించారు.జహీరాబాద్ నియోజకవర్గంలో వరదల కారణంగా పలు చోట్ల రోడ్లను మూసివేశారు. అల్గోల్-పొట్టిపల్లి, బూచనెల్లి-గణపూర్ గ్రామాల మధ్య రోడ్లపై నారింజ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

జహీరాబాద్ , ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండలంలోని పొట్టిపల్లి-అల్గోల్ గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జివద్ద వరదనీటిలో గల్లంతైన బొండ్ల బాస్కర్ (45) మృతదేహం బుధవారం లభించింది. జహీరాబాద్ రూరల్ ఎస్ఐ కాశీనాథ్ కథనం ప్రకారం ఈ నెల 11న గంగమ్మతెట్టెను విడిచేందుకు వెళ్లిన బొండ్ల బాస్కర్ ప్రమాదవశాత్తు కాలు జారి నారింజవాగులో పడిపోయాడు. దీంతో రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం సమీపంలోని చెరుకుతోటలో మృతదేహం లభ్యమైంది

నల్లవాగుకు జలకళ..!

నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 1493 అడుగులు కాగా, ప్రస్తుతం 1484 అడుగుల మేర నీరు చేరిందని అధికారులు ఆయనకు వివరించారు. భారీ వర్షాల వల్ల ఎప్పుడైనా పెద్ద ఎత్తున వరదలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను హెచ్చరించాలని ఎమ్మెల్యే సూచించారు. పోలీసు, రెవెన్యూ, నీటి పారుదల, వ్యవసాయ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని

- మిగతా 8వ పేజీలో...

ల్యాబే కదిలొస్తది

సంగారెడ్డి జిల్లాకు మొబైల్ సైన్స్ ల్యాబ్ మంజూరు

- రూ.19 లక్షలతో ఏర్పాటు
- 250 ప్రయోగాలు చేసేలా రూపకల్పన
- రేపు అధికారికంగా వాహనం ప్రారంభం
- సర్కారు బడి పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంపునకు దోహదం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాకు మొబైల్ సైన్స్ ల్యాబ్ వాహనం మంజూరైంది. డీఎంఎఫ్‌టీ కింద రూ.19 లక్షల నిధులతో ఈ వాహనాన్ని జిల్లా యంత్రాంగం సమకూర్చింది. సైన్స్‌పై ఆసక్తి పెంపొందించేందుకు, సైన్స్ విద్యను సర్కారు బడి విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు వీలుగా ఈ వాహనాన్ని అందుబాటులోకి తెచ్చారు. సైన్స్‌తో పాటు మ్యాథ్స్ ఇతర సబ్జెక్టు ప్రయోగాలు చేసేలా ఈ వాహనాన్ని రూపకల్పన చేశారు. ఈ వాహనం ఈ నెల 15 వ తేదీన పంద్రాగస్టును పురస్కరించుకుని అధికారికంగా ప్రారంభించనున్నారు. మరుసటి రోజు నుంచి వాహనాన్ని సర్కారు బడులకు తరలించి కేటాయించబడిన విషయ నిపుణుల పర్యవేక్షణలో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు చేయించనున్నారు.



సంగారెడ్డి జిల్లాకు మంజూరైన మొబైల్ సైన్స్ ల్యాబ్ వాహనం

శాస్త్రీయ దృక్పథం పెంపునకు...

విద్యార్థుల్లో దాగిఉన్న శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో దోహదపడనున్నాయి. ప్రతి విద్యార్థి ఏదైనా అంశాన్ని చూస్తూ చేస్తూ నేర్చుకుంటే ఎక్కువ రోజులు గుర్తుండే అవకాశం ఉంటుంది. ఇందులో భాగంగా తాను నేర్చుకున్న ప్రతి అంశాన్ని నిజ జీవితానికి అనుసంధానం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్య అందించి సర్కారు బడులను బలోపేతం చేయడమే ఉద్దేశ్యంగా ఈ వాహనాన్ని ఏర్పాటు చేశారు.

రోజుకో పాఠశాల..

జిల్లాకు మంజూరైన మొబైల్ సైన్స్ ల్యాబ్ వాహనం ప్రతి రోజు ఒక్కో పాఠశాలను సందర్శించి ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు స్వయంగా చేయిస్తారు. సుమారు 260 ప్రయోగాలు చేసేలా సామగ్రిని అందుబాటులోకి తెచ్చారు. ఇందులో భౌతిక శాస్త్రం(50), రసాయన శాస్త్రం(30), జీవశాస్త్రం(70), గణిత శాస్త్రం(60), సాంఘీక శాస్త్రం(50)కి సంబంధించిన వాటితో పాటు వినోదంతో పాటు విజ్ఞానాన్ని నేర్చుకునే విధంగా ఈ విజ్ఞాన ప్రయోగశాలను రూపొందించారు. అన్ని సర్కారు బడుల్లో సైన్స్ పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండకపోవచ్చు. జిల్లాలోని వెనుకబడిన మారుమూల ప్రాంతాల విద్యార్థులకు కూడా విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల వాహనంతో ప్రయోజనం చేకూరనున్నదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి తెలిపారు.



మొబైల్ సైన్స్ ల్యాబ్‌లో అందుబాటులో ఉండే సైన్స్, మ్యాథ్స్, ఇతర ప్రయోగాల సామగ్రి



ప్రయోగాలు చేసి చూపుతున్న జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు

- ముఖ్యఅతిథిగా మంత్రి వివేక్ వెంకటస్వామి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి వేడుకలను నిర్వహించే పోలీస్ పరేడ్ మైదానాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. వేదిక, కార్యక్రమానికి హాజరయ్యే వారు కూర్చుకోవడానికి సిట్టింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాలతో పాటు, శకటాలు తిరిగే ప్రదేశానికి స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకలకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... ప్రదర్శనలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, అదనపు ఎస్పీ మహేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



పంట కాలువ ఖతం..!

- చుట్టూ అడ్డగోలుగా నిర్మాణాలు, ఆక్రమణ
- రోజురోజుకూ కుచించుకుపోతున్న కాలువ
- తొమ్మిదో వార్డు కాలనీల్లోకి వర్షపు నీరు

నర్సాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణం సమీపంలోని కోమటికుంట నుంచి పొలాలకు నీరు వెళ్లే పంట కాలువ కుచించుకుపోతున్నది. దీని చుట్టూ చేపడుతున్న అడ్డగోలు నిర్మాణాలతో కాలువ ఆక్రమణకు గురై కనుమరుగవుతున్నది. దీంతో వర్షం పడినపుడల్లా సమీపంలోని 9వ వార్డులో పలు కాలనీలలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వాట్సాప్‌లో వ్యవసాయం

- వ్యవసాయ శాఖ నుంచి నేరుగా సమాచారం
- పంట సంరక్షణ సలహాలు,సబ్సిడీ పథకాలు
- వాట్సాప్ చానల్‌ను విడుదల చేసిన ప్రభుత్వం

రామాయంపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం వారం క్రితం వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిద్వారా మెదక్ జిల్లాలోని రైతులు ఉన్న చోటనుంచే సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు పొందే వీలుంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు పంట సంరక్షణ చర్యలపై సమాచారం అందిస్తున్నది. ఆండ్రాయిడ్ మొబైల్ కలిగిన ప్రతీ రైతు ఈ చానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. విత్తన దశ నుంచి పంట కోసే వరకు పాటించాల్సిన జాగ్రత్తలు రైతులు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు కూడా తెలుసుకునే అవకాశమున్నది. ఇకమీదట కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండదు. పంటలకు సంబంధించిన మార్కెట్ ధరలు, తదితర విషయాలను అన్నదాతలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.



వ్యవసాయ రంగంలో నూతన విప్లవం

వ్యవసాయ రంగంలో సమాచార నూతన విప్లవం మొదలైంది. గతంలో పంటలకు పలు రోగాలు వస్తే పట్టించుకున్న పాపాన పోయేవారు కాదు. అలాంటిది ఇప్పుడు మన మొబైల్ లోనే పంటలను కాపాడే వివరాలు లభించడం సంతోషదాయకం.

సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి..



గత వారం క్రితమే తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ సంయుక్తంగా వాట్సాప్ ఛానల్ విడుదల చేసింది.ఈ సమాచారం ఇంకా రైతుల దరి చేరలేదు.అందు వల్ల ఆలస్యం చేయకుండా ప్రతి రైతు తమ వద్దకు వచ్చి ఛానల్ సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి.

- రాజ్ నారాయణ,
వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు

సబ్‌స్క్రైబ్ చేయాలి

ఆండ్రాయిడ్ ఫోన్ కలిగిన రైతులకు వ్యవసాయ శాఖ అధికారులే దీనికి సంబంధించిన వాట్సాప్ చానల్ సబ్‌స్క్రైబ్ చేయిస్తున్నారు. అంతేకాకుండా దీనిని ఎలా వాడాలి, ఎలాంటి సౌకర్యాలు ఉంటాయన్న దానిపై కూడా అవగాహన చేస్తున్నారు.

నరకానికి నకళ్లు.. ఈ రోడ్లు

- హత్నూర మండలంలో గుంతలమయంగా ప్రధాన రహదారులు
- పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం బంద్
- జిన్నారంలో రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని శివానగర్- పటాన్‌చెరు రోడ్డు
- పారిశ్రామికవాడలో నిత్యం ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు

8లో

జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ లాభాల బాట

- భవిష్యత్‌లో సెలక్షన్ గ్రేడ్ స్థాయికి చేరే అవకాశం
- కొత్త దుకాణాల నిర్మాణంతో మరింత ఆదాయం


వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

జహీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) నాలుగు దశాబ్దాల క్రితం మూడు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ లాభాల బాటలో పయనిస్తోంది. ఒకప్పుడు సాధారణ మార్కెట్‌గా ఉండగా, ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ స్థాయికి చేరింది. త్వరలో సెలక్షన్ గ్రేడ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. జహీరాబాద్ అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో మార్కెట్‌కు వివిధరకాల ధాన్యం అధికంగా వస్తోంది. వ్యాపారుల రోజువారీ లావాదేవీలపై 1 శాతం వసూలు చేస్తారు. గంజ్ ద్వారా రూ.83.55 లక్షలు, సరుకుల దిగుమతి ద్వారా రూ.2.92 కోట్లు, చెక్‌పోస్ట్ ద్వారా రూ.5.45 లక్షలు, పశువుల మార్కెట్ ద్వారా రూ.31.85 లక్షలు, పండ్ల మార్కెట్ ద్వారా రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తుంది. ప్రస్తుతం మార్కెట్ యార్డులో ఉన్న పాత గోదాంను తొలగించి, రూ.3.35 కోట్లతో 24 కొత్త దుకాణాలు నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. ఈ నిర్మాణాలు పూర్తయితే మార్కెట్‌కు ఆదాయం పెరగనున్నది.

మార్కెట్ ఆదాయం

2020-21లో	రూ.1.30 కోట్లు
2021-22లో	రూ.2.19 కోట్లు
2022-23లో	రూ.2 కోట్లు
2023-24లో	రూ.5.13 కోట్లు
2024-25లో	రూ.3.28 కోట్లు

అభివృద్ధికి ప్రత్యేక కృషి



మార్కెట్ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. అదనపు ఆదాయ వనరులపై దృష్టి సారించాం. మార్కెట్‌లో సిబ్బంది కొరత ఉంది. గోదాంను తొలగించి దుకాణాలు నిర్మిస్తే ఆదాయం పెరుగనున్నది. మార్కెట్ పరిధిలో 54 మంది కమిషన్ ఏజెంట్లు, 55 మంది ట్రేడర్స్ ఉన్నారు. ఎక్కువ మొత్తంలో ధాన్యం వస్తుండటంతో ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

- చంద్రశేఖర్, మార్కెట్ ప్రత్యేక కార్యదర్శి

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొల్చారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సత్యకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం ఒకటి, ఆంగ్లం ఒకటి, రసాయనశాస్త్రంలో ఒక పోస్టు ఖాళీ ఉన్నదని చెప్పారు. అర్హులైన మహిళా అభ్యర్థులు బీఈడీతో పాటు సంబంధిత సబ్జెక్టులో పీజీ చేసి ఉండాలన్నారు. ఈనెల 20వ తేదీ బుధవారం వరకు సంబంధిత పత్రాలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఉపాధ్యాయుల మధ్య మాటల యుద్ధం

- ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసమేనా ఆర్టీసీ బస్సు
- కళాశాల విద్యార్థులను ఎందుకు తీసుకెళ్లరని ధర్నా
- పోలీసుల జోక్యంతో విరమించిన విద్యార్థులు


బస్సు ఎదుట ధర్నా ఆందోళన చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

చేగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఆదర్శ పాఠశాల విద్యార్థులను మాత్రమే బస్సులో తీసుకెళ్తూ.. ప్రభుత్వ కళాశాల విద్యార్థులను తీసుకెళ్లడం లేదని నిరసిస్తూ కళాశాల విద్యార్థులు బస్సు ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వ కళాశాలలో చదివేవారు విద్యార్థులు కారా.. ఆర్టీసీ డీఎం రావాలంటూ నినాదాలు చేస్తూ గంటన్నరపాటు ధర్నాకు దిగారు. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల, ఆదర్శ పాఠశాల వెళ్లే రహదారిపై బుధవారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే... చేగుంట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆదర్శ పాఠశాల సంబంధించిన సుమారు 800 మంది విద్యార్థులు రోజూ వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. కళాశాల విద్యార్థులు ఉదయం ఆర్టీసీ బస్సులో వస్తున్నా.. సాయంత్రం తీసుకెళ్లడం లేదని వాపోతున్నారు. ఆదర్శ పాఠశాల గేట్ లోపల ఆర్టీసీ బస్సు ఆపుతున్నారు. అక్కడికి వెళ్తే ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కళాశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులను ఎక్కించుకుని వెళ్తున్న బస్సును వెంబడించినా డ్రైవర్ కానీ, కండక్టర్ కానీ బస్సును ఆపడం లేదన్నారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి తమ విద్యార్థులను బస్సులో ఎందుకు తీసుకెళ్లడం లేదని నిలదీశారు. ఆర్టీసీ బస్సును ఆదర్శ పాఠశాల గేటు లోపల ఆపడం వల్ల తమ కళాశాల విద్యార్థులు అక్కడికి వెళ్తే ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు. దీంతో ఆదర్శ పాఠశాల, కాలేజీ ఉపాధ్యాయుల మధ్య మాటమాటా పెరిగి ఘర్షణ జరిగింది. విషయం తెలుసుకున్న చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులను, ఉపాధ్యాయులను సముదాయించారు. ఆర్టీసీ బస్సు అందరిదని, విద్యార్థులందరినీ తీసుకెళ్లాలని డ్రైవర్‌కు సూచించారు. దీంతో విద్యార్థులు ధర్నా విరమించారు.


వాగ్వాదం చేసుకుంటున్న ప్రభుత్వ కళాశాల, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

బస్సులో పరిచయం పెంచుకుని..

- మహిళపై దాడి చేసి.. బంగారు నగలు అపహరణ

నర్సాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో పక్కనే కూర్చున్న మహిళతో పరిచయం పెంచుకున్న ఓ వ్యక్తి.. బస్సు దిగిన తర్వాత ఆమెను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దాడి చేసి, నగలు దోచుకున్న ఉదంతం ఇది. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన వివరాలు ఎస్సై లింగం కథనం ప్రకారం.. మెదక్ నియోజకవర్గంలోని జానకంపల్లితండాకు చెందిన బిక్కి అనే మహిళ హైదరాబాద్ శివారులోని సురారంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లేందుకు మెదక్‌లో బుధవారం సాయంత్రం బస్సు ఎక్కింది. ఆమె సీటు పక్కన కూర్చున్న వ్యక్తి ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి ఆమెను నర్సాపూర్‌లో బస్సు దింపాడు. అక్కడ మద్యంతో పాటు తినడానికి అవసరమైన పదార్థాలు తీసుకుని ఇద్దరూ నర్సాపూర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి ఆటోలో వెళ్లారు. మద్యం తాగి.. తెచ్చుకున్న పదార్థాలు తిన్న తర్వాత అతను 'నీ దగ్గర ఉన్న డబ్బులు, నగలు ఇచ్చేయ్' అని బెదించాడు. ఆమె ఇవ్వకపోవడంతో పక్కనే ఉన్న రాయితో తలపై కొట్టి, ఆమె ఒంటిపై ఉన్న తులం బంగారు కమ్మలు తీసుకుని పరారయ్యాడు. రోడ్డు వరకు వచ్చిన ఆమెను చూసి కొందరు పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వెళ్లి ఆమెను నర్సాపూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రివాల్వర్ మిస్ ఫైర్ ఘటనపై డీఎస్పీ విచారణ

జోగిపేట రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట సర్కిల్ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్ రివాల్వర్ మిస్ ఫైర్ ఘటనపై డీఎస్పీ సత్తయ్యగౌడ్ విచారణ చేపట్టారు. బుధవారం జోగిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ అనిల్‌కుమార్‌తో పాటు సిబ్బంది జరిగిన ఘటనపై ఆరాతీశారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను ఎస్పీ పరితోష్ పంకజ్‌కు అందజేస్తానని డీఎస్పీ తెలిపారు.

నీటి పారుదలశాఖ ఎస్ఈగా పోచమ్మలు

సంగారెడ్డిటౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్‌గా పోచమ్మలు బుధవారంనాడు బాధ్యతలు స్వీకరించారు. భువనగిరి జిల్లా ఇరిగేషన్ శాఖ ఇఇగా పనిచేసిన పోచమ్మలు పదోన్నతిపై సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ ఎస్ఈగా బదిలీపై వచ్చారు.

పెన్షన్ల పెంపుపై రేవంత్ సర్కార్‌తో తాడో పేడో తేల్చుకుందాం..

- సెప్టెంబరులోపు హామీ నిలబెట్టుకోకపోతే గద్దెదిగే రోజులు దగ్గర పడ్డట్లే..
- ప్రశ్నించే ప్రతిపక్షం రాష్ట్రంలో లేదు..
- కేసీఆర్ అసెంబ్లీకి రాడు.. ప్రజల్లో తిరగడు..
- చేయూత పెన్షన్ల పెంచే డబ్బును భూస్వాములకు కట్టబెట్టారు
- రేవంత్‌రెడ్డి, కేసీఆర్ కంటే చంద్రబాబు వంద రెట్లు బెటర్
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హుస్నాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పెంపు కోసం రేవంత్‌రెడ్డి సర్కార్‌తో తాడో పేడో తేల్చుకుందామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. అందు కోసమే సెప్టెంబర్ మూడవ తేదీన హైదరాబాద్‌లో సభ పెట్టామని వెల్లడించారు. బుధవారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన నియోజకవర్గ దివ్యాంగుల, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జన సభ సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరిస్తున్నానని, సెప్టెంబరులోపు పెన్షన్లు పెంచుతామన్న మాటకు కట్టుబడి ఉండకపోతే కచ్చితంగా మీ ప్రభుత్వం గద్దె దిగే రోజులు దగ్గర పడ్డాయనేది గుర్తుంచుకోవాలన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు ఎవరు లేరనేది భావించవద్దని, వీరు సంఘటితమైతే హైదరాబాద్ నగరం దిగ్బంధం అవుతుందని, అది మీరు చూడబోతారని, ఆ పరిస్థితిని కోరి తెచ్చుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో ప్రశ్నించే ప్రతిపక్షం లేదని, ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్ అసెంబ్లీకి రాడు, ప్రజల్లోకి వెళ్లడని ఆరోపించారు. అందుకే 50 లక్షల పెన్షన్‌దారుల కోసం ఎమ్మార్పీఎస్ రోడ్డుపైకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే వికలాంగులకు రూ.6 వేలు, అసరా పెన్షన్లు రూ. 4 వేలు పెంచితే 20 నెలల కాలంలో ఒక్కొక్కరు రూ.40 వేలు వచ్చేవని, కాని వీరికి చెందిన రూ.20 వేల కోట్ల డబ్బును రుణమాఫీ పేరుతో భూస్వాములకు కట్టబెట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కంటే ఆంధ్రప్రదేశ్ సీఎం వంద రెట్లు బెటర్ అని, ఆయన హామీ ఇచ్చిన నాటి నుంచి పెంచిన డబ్బును పెన్షన్‌దారులకు అందించారన్నారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెండెల సమ్మయ్య, జిల్లా కో ఆర్డినేటర్ చిట్టెల సంపత్, రాజేశ్వరి, శంకర్, నియోజకవర్గ అధ్యక్షుడు మేడబోయిన వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కాయిత నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయ సేవలందిస్తాం

- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్


కౌడిపల్లి రైతువేదికలో రైతులతో మాట్లాడుతున్న సునీల్

చిన్నశంకరంపేట/చేగుంట/కౌడిపల్లి/కొల్చారం/నర్సాపూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పంటలు సాగుచేసే రైతులకు న్యాయ సేవలందిస్తామని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో ఆయా మండలాలకు చెందిన ఏవోలు, తహసీల్దార్లకు సాగు న్యాయయాత్ర రైతు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు నాటిన నుంచి పంట చేతికొచ్చే వరకు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం న్యాయ సేవలందిస్తామన్నారు. రైతులు సమస్యలు పరిష్కరించే దశగా ప్రభుత్వం చేసిన చట్టాలను రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాలతి, ఏవో లక్ష్మీప్రవీణ్, ఏఈవోలు నాగేంద్ర, మధులిక పాల్గొన్నారు. అలాగే చేగుంట మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు సాగు న్యాయయాత్ర ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ఏవో హరిప్రసాద్, సొసైటీ చైర్మన్ పరమేష్ పాల్గొన్నారు. కౌడిపల్లి మండలంలోని రైతువేదికలో రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ సాగు న్యాయయాత్ర రైతు ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గున్న రాజేందర్‌రెడ్డి, భూదాన్ బోర్డు మాజీ చైర్మన్, లీఫ్స్ సంస్థ ప్రతినిధులు జీవన్ పాల్గొన్నారు. కొల్చారం మండలంలోని రైతువేదికలో నిర్వహించిన సాగు న్యాయ యాత్ర రైతు ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నర్సాపూర్ రైతువేదికలో సాగు న్యాయ యాత్రలో భాగంగా స్థానిక రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్ పాల్గొన్నారు.

మాందాపూర్ అటవీ ప్రాంతంలో ఆదిమానవుడి ఆనవాళ్లు

- దాని సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన


మాందాపూర్ అటవీ ప్రాంతంలో ఆదిమానవుని ఆనవాళ్లు

జగదేవ్‌పూర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని మాందాపూర్ అటవీ ప్రాంతంలో ఆదిమానవుడి ఆనవాళ్లు, వారు వేసిన చిత్రాలు వెలుగుచూశాయి. మాందాపూర్ గ్రామ సమీపంలో 420 ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి విశాలమైన రాతి కొండలు ఉన్నాయి. ఓ రాతి బండలపై ఆదిమానవుడు వేసిన చిత్రాలు నేటికీ చెక్కు చెదరకుండా దర్శనమిస్తున్నాయి. రాతి గుండు కింద భాగంలో మనిషిని పోలిన చిత్రం కనిపిస్తుంది. ఈ చిత్రాలు చూసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. పెద్ద గుహ దానిలో వందిమంది ఉండేవిధంగా రాతి గుండు ఉన్నది. ఈ గుండు కింద నక్సలైట్ల కాలంలో వారు దాచుకునేవారని, స్థావరం ఏర్పాటు చేసుకునే వారని గ్రామస్థులు చెబుతున్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు..?

ఆదిమానవుడు వేసిన చిత్రాల గుండు సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు తెలుస్తోంది. గుండుపై రంధ్రాలు ఉండడం వల్ల రాత్రి సమయాల్లో ఈ తవ్వకాలు జరిపినట్లు సమాచారం. నెలరోజుల క్రితం ఈ తవ్వకాలు జరిపినట్లు అనుమానాలు వ్యక్తం అవుతుండగా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

- ఈ నెలలోనే ఎస్జీఎఫ్ క్రీడలు
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు..
- ప్రతిభ కనబరిస్తే జిల్లాస్థాయికి ఎంపిక


కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)

ఆటాడుకుందాం.. రా..!

దౌల్తాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే బాలబాలికలు క్రీడలపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఏటా ఎస్జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) పోటీలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది కూడా ఇదే నెలలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. షెడ్యూలును రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఇటీవలే ప్రకటించింది. క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం, ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపిక చేయడం ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం.

ఎస్జీఎఫ్‌లో భాగంగా అండర్ 14-17 విభాగంలో పాఠశాల, అండర్-19 విభాగంలో ఇంటర్ విద్యార్థులకు మండల, జోనల్, జిల్లా స్థాయిల్లో విడతల వారీగా నిర్వహిస్తారు. ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అక్కడి నుంచి, రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపిస్తారు. మండల వారీగా ఒక్కో క్రీడాంశంలో ఒక జట్టును ఎంపిక చేస్తారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందిస్తారు. వీటితో విద్య, ఉద్యోగాలకు క్రీడా కోటా కింద 2శాతం రిజర్వేషన్ల సదుపాయమూ ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

ఆటలు ఇవే..

వాలీబాల్, కబడ్డీ, ఫుట్ బాల్, కోకో, తైక్వాండో, కరాటే, టేబుల్ టెన్నీస్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నారు. నిర్వహణకు ప్రభుత్వం పరంగా కొంత మేరకే సహకారం అందుతున్నప్పటికీ ఎప్పటిలాగానే దాతల సహకారం తీసుకోవాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నెల చివరి వరకు మండల స్థాయి పోటీలను పూర్తి చేసి.. సెప్టెంబరులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలు సాగనున్నాయి.

కార్యచరణ రూపొందిస్తున్నాం..

ఇటీవలే ఎస్జీఎఫ్ క్రీడలకు సంబంధించి కొందరు శిక్షణకు వెళాలరు. వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, సీనియర్ల సలహాలు తీసుకుని ఈ పోటీల నిర్వహణకు కార్యచరణ రూపొందిస్తున్నాం. పోటీల నిర్వహణకు దాతలు, క్రీడాభిమానులు సహకరించాలి.

- గజ్జల కనకరాజు, ఎస్జీఎఫ్ క్రీడల మండల కన్వీనర్


పులిమామిడిరాజు మాతృమూర్తి భాగమ్మకు నివాళులర్పిస్తున్న నీలం మధుముదిరాజ్, పలువురు రాజకీయ ప్రముఖులు

పులిమామిడి భాగమ్మకు ఘన నివాళి

సదాశివపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ముదిరాజ్ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిమామిడిరాజు మాతృమూర్తి పులిమామిడి భాగమ్మ దశదినకర్మను బుధవారం సదాశివపేట పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, పలు పార్టీల ముఖ్య నాయకులు, పీఎంఆర్ యువసేన అభిమానులు, కార్యకర్తలు భాగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు నీలం మధుముదిరాజ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్, ప్రముఖ వ్యాపారులు రాంరెడ్డి, కొండల్‌రావు, సుబ్బారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ ఏఎంసీ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామాల పెద్దలు, యువ నాయకులు పులిమామిడిరాజు కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.


శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న సీడీపీవో అంజమ్మ

అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించిన సీడీపీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోహీర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మున్సిపల్ పట్టణంలోని భీమ్‌నగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ దుస్థితిపై 'శిథిల భవనంలో అంగన్‌వాడీ' అనే కథనం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఐసీడీఎస్ అధికారులు శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించి, ప్రైవేట్ భవనంలోకి మార్చారు. నూతన అంగన్‌వాడీ నిర్మాణ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని సీడీపీవో అంజమ్మ తెలిపారు. ఆమె వెంట సూపర్‌వైజర్ తులసి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

జహీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ సంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో జడ్జి జయంతి బుధవారం తీర్పును వెలువరించారని చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం జహీరాబాద్ మండలంలోని మధులైతండాకు చెందిన రాథోడ్ సంజీవ్(30) 2020లో అదే తండాకు చెందిన బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితులు చిరాగ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఎస్ఐ గణేష్ పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారన్నారు. నిందితుడిని సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపర్చగా.. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో జడ్జి జయంతి ఐదేళ్ల జైలు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీ సూర్‌రెడ్డి, విచారణ అధికారి గణేష్, ప్రస్తుత ఎస్ఐ రాజేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు క్రిష్ణ, కోర్టు లైజనింగ్ అధికారి శంకర్, సత్యనారాయణను ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

చిల్వర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఐదుగురికి తీవ్రగాయాలు
- సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి


నుజ్జునుజ్జైన ఆటో, తీవ్రగాయాలతో ప్రయాణికులు

అల్లాదుర్గం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామం 161వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని పోచయ్య(చికోడ్), ప్రవీణ్(యూసుఫ్‌పేట్), గోపాల్(పొడ్చన్‌పల్లి), అంతయ్య(ఆర్కెల) గ్రామాలతో పాటు అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామానికి చెందిన బాలరాజ్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యానికి ఆటోలో వెళ్లి తిరిగి వస్తున్నారు. అల్లాదుర్గం నుంచి సంగారెడ్డికి అతివేగంగా వెళ్తున్న సంగారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు చిల్వర్ చౌరస్తా వద్ద ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలిస్తుండగా బాలరాజ్ అనే వ్యక్తి మృతిచెందాడు.

జాతీయ రహదారిపై గ్రామస్థుల ఆందోళన

చిల్వర్ చౌరస్తా వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు ఆందోళన చేశారు. దీంతో స్థానిక పోలీసులు ఆందోళనకారులను సముదాయించి, రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ వేయిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

ప్రమాదవశాత్తు పశువుల పాకకు నిప్పు

- రెండు గేదెలు, ఐదు దూడలు మృతి
- కాలిబూడిదైన గడ్డివాము, రూ.5 లక్షల ఆస్తి నష్టం

శివ్వంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పశువుల పాకకు నిప్పంటుకుని రెండు గేదెలు, మూడు దూడలు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పరిధి బోజ్యాతండా పంచాయతీ పరిధిలోని మాల్యాతండాలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ పాండు మంగళవారం తన పొలం వద్ద పశువుల షెడ్డులో రోజులాగే గేదెలు, దూడలను కట్టేసి ఇంటికెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు పంచాయతీ వాటర్‌మన్ వాటర్ సప్లయ్ కోసం వెళ్లగా.. మంటలు వస్తుండడాన్ని గమనించి పాండుకు చెప్పాడు. వెంటనే పాండు వెళ్లి చూడగా అప్పటికే రెండు గేదెలు, ఐదు దూడలు మృతిచెందాయి. మరో నాలుగు దూడలకు గాయాలయ్యాయి. అలాగే పశువుల షెడ్డుకు సమీపంలో ఉన్న సుమారు వెయ్యి మోపుల గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు పాండు వాపోయాడు. ఇదిలి ఉండగా మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక వాహనం వచ్చినప్పటికీ బురదగా ఉన్న మట్టి రోడ్డులో వాహనం దిగబడడంతో తిరిగి వెళ్లిపోయింది. ఘటనా స్థలాన్ని పశు వైద్యాధికారి సంధ్యారాణి, ఆర్ఐ కిషన్ పరిశీలించి పంచనామా నిర్వహించారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు పాండు బోరున విలపించాడు. కాగా ఘటనా స్థలాన్ని చూసిన పాండు తండ్రి లక్ష్మణ్ స్పృహ కోల్పోయి పడిపోవడంతో ఆస్పత్రికి తరలించారు.


మృతిచెందిన గేదెలు, దూడలు

చేర్యాల-నంగునూరు రోడ్డు దుస్థితి మారేనా...

- అంగడిబజారు చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ వరకు గుంతలమయం
- వాహనం ఎదురొస్తే.. మరో వాహనం నిలుపుకోవాల్సిందే
- విస్తరణకు నోచుకోక, మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం


అంబేడ్కర్‌నగర్ కాలనీ మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

ప్రమాదారి

చేర్యాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణం నుంచి నంగునూరు, హుస్నాబాద్ మండలాలకు ప్రయాణించే రహదారి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. అంగడిబజారు చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ కాలనీ వరకు పలు ప్రదేశాల్లో బీటీ లేచి గుంతలమయమైంది. విస్తరణకు నోచుకోకపోవడంతో పాటు కనీసం మరమ్మతులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖఅధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తా నుంచి అంబేడ్కర్‌నగర్, పెద్దమ్మగడ్డ కాలనీ మీదుగా ధూళిమిట్ట, నంగునూరు, మద్దూరు, హుస్నాబాద్ తదితర మండలాలకు ప్రయాణిస్తుంటారు. నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు ఆటోలు, ప్రైవేటు వాహనాల రాకపోకలతో ఈదారి రద్దీగా ఉంటుంది. చాన్నాళ్లక్రితం రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పట్టణ పరిధిలోని అంగడిబజారు చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ కాలనీ వరకు పలు ప్రదేశాలు, మూలమలుపుల వద్ద రోడ్డు పాడైపోయింది. బీటీ లేచి గుంతలమయవడంతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వ ఉండి ఆయా ప్రదేశాలు చిత్తడిగా మారాయి. చీకట్లో గుంతలు కనిపించక వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు.

మంజూరు కాని నిధులు

చాన్నాళ్ల క్రితం ఆకునూరు నుంచి నంగునూరు మార్గానికి రోడ్డు విస్తరణ చేపట్టారు. ఈ క్రమంలో పట్టణ పరిధిలో స్థానిక అంగడిబజారు నుంచి విస్తరణ చేపట్టేందుకు గతంలో ప్రతిపాదించారు. కానీ పలువురి ఇండ్లు పాక్షికంగా, మరికొందరు పూర్తిగా కోల్పోతున్న పరిస్థితి నెలకొనడంతో విరమించుకున్నారు. నానాటికీ పట్టణం విస్తరిస్తుంటడంతో పాటు వాహనాల రాకపోకలు పెరిగిపోతుండటంతో దారి ఇరుకుగా మారింది. ఓ వాహనం ఎదురుగా వస్తే మరోవాహనాన్ని నిలుపుకుంటున్న దుస్థితి నెలకొంది. ఇదేదారిలో పాఠశాలలు, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలు ఉండటంతో పాటు ఆయాగ్రామాల ప్రజల రాకపోకలతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలు నిలిచిపోతూ ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం చేర్యాల నుంచి నంగునూరు మండల శివారు నాగరాజుపల్లి వరకు రెన్యూవల్ పనుల కోసం రూ.15 లక్షల వ్యయం కానుందన్న ప్రతిపాదనలు పంపించినా.. నిధులు మంజూరుకాలేదు. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికే రోడ్డు అతీగతీ లేకుండాపోయింది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నరకప్రాయంగా ఉంది

పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి పెద్దమ్మగడ్డ వరకు రోడ్డు భారీగా దెబ్బతిని గోతులు ఏర్పడటంతో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. అంబేడ్కర్‌నగర్ మూలమలుపు వద్ద రోడ్డు కోతకు గురైంది. వాహనాలు దిగబడుతున్నాయి. మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేతకు చర్యలు తీసుకోవాలి.

- బోయిని రాజు, ఆకునూరు

ఫ్లడ్ డ్యామేజ్ కింద ప్రతిపాదలు పంపించాం

చేర్యాల-నంగునూరు వరకు దారి పొడవునా ఏర్పడిన గుంతలు పూడ్చివేత, రెన్యూవల్ పనుల కోసం కొద్దిరోజుల క్రితం రూ.15 లక్షల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం రోడ్డు దెబ్బతిన్న క్రమంలో ఫ్లడ్ డ్యామేజ్ ద్వారా చేపట్టేందుకు ప్రతిపాదించాం. నిధులు మంజూరుకాగానే మరమ్మతులు చేస్తాం.

- నాగరాజు, ఆర్అండ్‌బీ ఏఈఈ

న్యూస్ బాక్స్

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిరుపేదలకు అందజేస్తున్న సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మొగుడంపల్లి గ్రామానికిచెందిన చాకలి అంజమ్మకు రూ.2.లక్షలు విలువచేసే సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.అలాగే కోహీర్‌కు చెందిన రాజశేఖర్‌కు రూ.1.50 లక్ష విలువ చేసే ఎల్‌వోసీని అందజేశారు.

హజ్ యాత్రకు మెదక్ జిల్లా నుంచి 46 మంది ఎంపిక

మెదక్, కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్ యాత్రకు 2026 సంవత్సరానికి గాను మెదక్ జిల్లా నుంచి 46 మంది ఎంపికయ్యారని మెదక్ జిల్లా హజ్ కమిటీ కార్యదర్శి ఎజాజుద్దీన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నిటిని పరిశీలించి లాటరీ ద్వారా ఎంపిక చేశారన్నారు

అంతరిక్ష విజ్ఞానంతోనే ప్రపంచ అభివృద్ధి సాధ్యం: ఇస్రో శాస్త్రవేత్త

నారాయణఖేడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంతోనే ప్రపంచ అభివృద్ధి సాధ్యమని ఇస్రో శాస్త్రవేత్త హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్హేర్ మండల పరిధిలోని మార్డికి చెందిన ఆయన కేరళలోని తిరువనంతపురం ఇస్రో కేంద్రంలో శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. బుధవారం ఖేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అంతరిక్ష పరిశోధన - విద్యార్థుల కర్తవ్యం అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి విజ్ఞానం పట్ల అవగాహన పెంచుకొని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై వ్యాసరచన పోటీలు

నారాయణఖేడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఖేడ్‌లోని నియోప్రగతి ఉన్నత పాఠశాలలో బుధవారం స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లాస్టిక్ నిర్మూలన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనగా మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించా రు.

కార్మికుల కృషితోనే ఆర్టీసీ అభివృద్ధి

నారాయణఖేడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది కృషితోనే ప్రగతి పథంలో నడుస్తుందని, దీంతో సంస్థ బలోపేతమౌతుందని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఖేడ్ నుంచి లింగంపల్లి, పటాన్ చెరు, సికింద్రాబాద్‌లకు తిప్పిన ప్రత్యేక బస్సులతో గణనీయ ఆదాయం వచ్చినందున కష్టపడ్డ, ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది అందరికీ బుధవారం డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిఠాయి పొట్లాలను పంపిణీ చేశారు.

పార్కుల్లో సుందరీకరణ

రామచంద్రాపురం టౌన్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న పార్కుల ను సుందరీకరణ చేస్తున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్‌నాగర్ జలవిహార్ పార్కులో రూ.కోటి అంచనా వ్యయంతో జరుగుతున్న సుందరీకరణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఆత్మకమిటి డైరెక్టర్ నగేష్, పీటర్, స్వామాట్, ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

చిలప్‌చెడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా గ్రామాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నరకానికి నకళ్లు.. ఈ రోడ్లు

- హత్నూర మండలంలో గుంతలమయంగా ప్రధాన రహదారులు
- పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం బంద్
- పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి
- జిన్నారంలో రెండేళ్లుగా మరమ్మతులకు నోచుకోని శివానగర్- పటాన్‌చెరు రోడ్డు
- పారిశ్రామికవాడలో నిత్యం ప్రమాదాలు జరిగినా పట్టించుకోని అధికారులు



హత్నూర: గుంతలమయంగా శేర్కాన్‌పల్లి- హత్నూర రోడ్డు



జిన్నారం: అధ్వానంగా శివానగర్-పటాన్‌చెరు ప్రధాన రోడ్డు

హత్నూర/జిన్నారం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హత్నూర, జిన్నారం మండలాల్లో ప్రధాన రహదారులతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. హత్నూర మండలంలోని ప్రధాన రోడ్లు గుంతల మయంగా మారి వాహనదారులకు నరకాన్ని తలపిస్తున్నాయి. మండలంలోని శేర్కాన్ ఖాన్‌పల్లి-నత్నాయపల్లి ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. గుంతల కారణంగా ఆర్టీసీ బస్సులు తరుచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆయా గ్రామాల మీదుగా పటాన్‌చెరు వెళ్లే ఆర్టీసీ బస్సును కూడా అధికారులు రద్దు చేశారు. దీంతో నర్సాపూర్, పటాన్‌చెరు పట్టణాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు, వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా కొంతమంది పేద విద్యార్థులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తి చదువులకు అర్థాంతరంగా దూరమయ్యే పరిస్థితి నెలకొన్నది.

జిన్నారం మండలంలో...

జిన్నారం మండలంలోని శివానగర్ నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత రెండేళ్లుగా ఈ రహదారిపై రెండు అడుగుల మేర గుంతలు ఏర్పడినా, కనీస మరమ్మతులకు నోచుకోలేదని, వర్షాల ధాటికి ఈ రహదారి మరింత ప్రమాదకరంగా మారిందని మండల బీజేపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి తెలిపారు. కాగా జిన్నారం-అన్నారం, గడ్డపోతారం-కాజీపల్లి పరిధిలోని పలు పారిశ్రామిక రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారి, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేసి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయా మండలాల ప్రజలు కోరుతున్నారు.

మెదక్ జిల్లాలో మండలస్థాయి టీఎల్ఎం మేళా



మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూహైస్కూల్‌లో ప్రదర్శనలను తిలకిస్తున్న డీఈవో రాధాకిషన్



చిన్నశంకరంపేట: ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సులువైన విద్యాబోధనకు ఉద్దేశించిన టీఎల్ఎం మేళాలను మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు మెదక్ జిల్లా కేంద్రంలోని న్యూహైస్కూల్‌తో పలు మండలాల్లో నిర్వహించిన మండలస్థాయి టీఎల్ఎం మేళాలను డీఈవో రాధాకిషన్ ప్రారంభించారు. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరంగా నైపుణ్యవంతంగా బోధించడానికి అవసరమైన బోధనోపకరణ సామగ్రిని మేళాలో ప్రదర్శించారు. పలుచోట్ల వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శాస్త్ర ప్రదర్శనలు రూపొందించి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈసందర్భంగా డీఈవో రాధాకిషన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధన దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మేళాలో ఉపాధ్యాయులు తయారు చేసి బోధన పరికరాలను పరిశీలించి, ఉత్తమ పరికరాలకు జిల్లా స్థాయికి పంపించనున్నట్టు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లా కంగ్టి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన టీఎల్ఎం మేళాలో తహసీల్దార్ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు టీఎల్ఎంను ఉపయోగించి బోధన చేయడం ద్వారా విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఎంఈవో రహీమొద్దిన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో స్థానికులకు ప్రాధాన్యమివ్వాలి

రామచంద్రాపురం టౌన్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు భర్తీ చేస్తున్న సమయంలో స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. బుధవారం రామచంద్రాపురం భెల్ యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరుకు ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేసిందని చెప్పారు. భవనం నిర్మించడానికి సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరారు. ఇక్రిశాట్ ఫెన్సింగ్ ఏరియాలో పురాతన ఆలయం నిర్మాణానికి సైతం నిధులు ఇవ్వాలని కోరారు. అనంతరం భెల్ ఈడీ భరణిరాజా మాట్లాడుతూ 515 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామని వివరించారు. అర్హత కలిగిన నిరుద్యోగులు వచ్చే నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎం సురన్‌ప్రసాద్ తదితరులు ఉన్నారు.



సింఫనీహోమ్స్ కాలనీలో విద్యుత్తు ఉపకేంద్రం పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నిరంతర విద్యుత్ సరఫరా

పటాన్‌చెరు ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాలెరెడ్డి పేర్కొన్నారు. బుధవారం తెల్లాపూర్ పురపాలక పరిధి పోచారం, పటాన్‌చెరు డివిజన్ పరిధి సింఫనీహోమ్స్ కాలనీల్లో రూ.16.5 కోట్ల అంచనా వ్యయంతో రెండు విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులు కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ట్రాన్స్‌కో డీఈ భాస్కర్ రావు, తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు: ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ విడతలవారీగా ఇందిరమ్మ గృహాల మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సంజీవ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ వంశీ, నాయకులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యేలా చూడాలని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నిర్మాణ దశలను బట్టి బిల్లులు ఖాతాల్లో వేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ చలపతి రావు, డీఈ సతీష్, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, ఏఈలు సత్యనారాయణ, వంశీ పాల్గొన్నారు.



ఖేడ్‌లో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

సీఎస్ఆర్ అభివృద్ధిని వేగవంతం చేయాలి

● సీఎస్ఆర్ కమిటీ సమావేశంలో సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సీఎస్ఆర్ కింద చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం సీఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు సేకరించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్‌ను ఆదేశించారు. గత మూడేళ్లుగా జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులు ఎంత మేరకు ఖర్చు చేశాయి అనే వివరాలు అందజేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. విద్యాశాఖలో సీఎస్ఆర్ నిధులతో అనుమతించబడిన పనుల వివరాలను డీఈవో అందజేయాలన్నారు. వైద్య శాఖలో అనుమతించబడిన పనుల వివరాలను డీఎంహెచ్‌వో అందించాలని ఆదేశించారు. జిల్లాలో అవసరమున్న పనులను గుర్తించి వాటి వివరాలను సీఎస్ఆర్ కమిటీకి నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. సీఎస్ఆర్ నిధులతో జరుగుతున్న పనుల నాణ్యతను సంబంధిత అధికారులు తనిఖీ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం తుల్జానాయక్, సీపీవో బాలశౌరి, డీఈవో వెంకటేశ్వర్లు, డీఐఈవో గోవిందరామ్, డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల, అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి

చేగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండలంలోని చిన్న శివనూర్ గ్రామంలోని వేంకటేశ్వర ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను బుధవారం జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ప్రకాష్‌రావు, ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పరిశ్రమంలో కార్మికులకు సంబంధించి సేఫ్టీ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పరిశ్రమ యజమానులకు సూచించారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

నర్సాపూర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వచ్చిన ఫిర్యాదులను తక్షణమే స్పందించి వాటిని సత్వరమే పరిష్కరించడానికి కృషి చేయాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సందర్భంగా రికార్డులు, కేసు డైరీలు, హిస్టరీ షీట్స్ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారి పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు.

శివ్వంపేటలో బాంబు స్క్వాడ్ తనిఖీలు



బస్టాండ్ సమీపంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

శివ్వం పేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు జరగకుండా ముందస్తు చర్యగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బుధవారం శివ్వంపేటలో ఎస్ఐ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో రోడ్డుపై బాంబు స్క్వాడ్, జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు.



జహీరాబాద్ : పొట్టిపల్లి-అల్గోల్ గ్రామాల మధ్య రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసి మూసివేసిన అధికారులు

వాగులు ఫుల్.. దారులు బంద్

(5వ పేజీ తరువాయి)

ఆయన ఆదేశించారు.

పరిశీలించిన ఎస్పీ..

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఝరాసంగం మండలంలోని పోట్‌పల్లి, నారింజ, ప్యాలవరం వాగులను పరిశీలించారు. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. యువకులు, చిన్నారులు చెరువులు, వాగుల వద్దకు వెళ్లకుండా పంచాయతీ కార్యదర్శులు రాత్రిపూట చాటింపు వేయించాలని ఆయన ఆదేశించారు. అలాగే, రాయికోడ్‌లోని యూసుఫ్‌పూర్ వాగును కూడా ఆయన పరిశీలించారు, గతంలో జరిగిన వ్యక్తి మృతి ఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు

జాతీయ రహదారిపై ప్రమాదాలు, ఆందోళనలో రైతులు

నారాయణఖేడ్-బీదర్ 161 బీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పిప్రి-మనూరు గ్రామాల మధ్య రోడ్డు చిత్తడిగా మారడంతో వాహనదారులు భయంతో ప్రయాణాలు చేస్తున్నారు. ఈ రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. అదేవిధంగా, నాగల్‌గిద్ద మండలంలో కారాముంగి, కేశ్వార్ వంటి గ్రామాలకు వెళ్లే రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడి చెరువులుగా మారాయి. ఉట్‌పల్లి, గుడూరు, ముక్తాపూర్ శివార్లలో పత్తి పంటలలో వర్షపు నీరు నిలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో నాగల్‌గిద్ద మండలంలో సబ్ కలెక్టర్ ఉమా హారతి రోడ్లు, చెరువులను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.



సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు



కంది: ఐఐటీహెచ్‌లో మాదకద్రవ్యాల నిరోధంపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా అధికారులు



మెదక్ కలెక్టరేట్‌లో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

మత్తు పదార్థాలను తరిమి కొడదాం

నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలను తరిమికొడదామని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాలలో ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలతో సంబంధిత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఆయా జిల్లాల ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

- న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి)



కంది: యాంటిడ్రగ్ సోల్జర్ పాయింట్ వద్ద అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ సెల్ఫీ



మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు



నర్సాపూర్ బస్టాండులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీవో మహిపాల్, డీఎస్పీ నరేందర్‌గౌడ్ తదితరులు

క్రీడలతో మానసిక ఉల్లాసం: మెదక్ కలెక్టర్



క్రీడాకారులతో క్యారమ్ ఆడుతున్న కలెక్టర్

మెదక్ అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలగడం తోపాటు ఒత్తిడిని జయించవచ్చని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం మెదక్ స్టేడియంలో ఉద్యోగులకు రెండు రోజుల పాటు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం ఈ పోటీలను కలెక్టర్ పరిశీలించి, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గెలుపొందిన క్రీడాకారులకు ఆగస్టు 15న ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి

చిలప్‌చెడ్: పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం చిలప్‌చెడ్ మండలం బండపోతుగల్‌గల్ గ్రామంలో పశువుల టీకాలు వేసే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పశువైద్యులతో కలెక్టర్ మాట్లాడి బ్లూ టంగ్ వ్యాధి నివారణకు ఇచ్చే టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా 1,42000 పశువులకు సంబంధించి బ్లూ టంగ్ వాక్సినేషన్ దాదాపు పూర్తి కావచ్చిందని, ముద్ద చర్మవ్యాధి 45000 టీకాలు అందుబాటులో ఉంచుకొని ఈ వ్యాక్సినేషన్ సంబంధించి 80 శాతం కార్యక్రమం పూర్తి చేశామని చెప్పారు. అనంతరం పాల ఉత్పత్తిని పెంచే మినరల్ మిక్చర్, క్యాల్షియం ప్యాకెట్లను, పశుగ్రాస విత్తనాలు కలెక్టర్ రైతులకు పంపిణీ చేశారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రశాంత్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటయ్య, నర్సాపూర్ ఏడీ జనార్దన్, చిట్కుల్ పశు వైద్యాధికారి వినోద్ ఇతర వైద్యాధికారులు ప్రియాంక, గీతా మాధురి, రైతులు, ఏపీవో శ్యాం కుమార్, ఎంపీవో తిరుపతి, కార్యదర్శి పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలి



చిద్రుప్ప ఉప ఆరోగ్య కేంద్రంలో మందులపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగనిర్మల

కంది, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు రాకుండా చిన్నపిల్లలకు అందించే రోగ నిరోధక శక్తి వ్యాక్సీన్‌లు అందుబాటులో ఉంచాలని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డాక్టర్ నాగనిర్మల ఆదేశించారు. బుధవారం ఆమె కంది మండలంలోని చిద్రుప్పలో ఉప ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన బాలింతలతో ఆమె మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారంపై ఆమె బాలింతలకు అవగాహన కల్పించారు.

ఐడీఏబొల్లారం ప్రజలకు ఉచితంగా తాగునీరు

ఐడీఏబొల్లారం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కాలుష్య ప్రభావిత ప్రాంతాలకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని దాన్ని అధికారులు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి చెప్పారు. ఈ మేరకు బుధవారం బీజేపీ ఐడీఏబొల్లారం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి కి వినతిపత్రం సమర్పించి పరిస్థితిని వివరించినట్టు తెలిపారు. దీనిపై సానుకూలంగా నీటిబిల్లులు మాఫీ చేస్తామంటూ హామీ ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, అఖిల్, శ్రీకాంత్‌చారి, అరుణ్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

ఐడీఏబొల్లారం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక పట్టణాల్లో పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందని కమిషనర్ కిషన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఐడీఏబొల్లారం మున్సిపల్ పార్కులో మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వీరేంద్ర, వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం అధికారి చంద్రశేఖర్, డీఈ సత్యనారాయణ, మేనేజర్ మల్లికార్జునస్వామి, రెవిన్యూ అధికారి నర్సింలు, ఏఈ కిష్టయ్య

కన్నవారి కలలను సాకారం చేయండి

పుల్‌కల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కన్నవారి కలలను సాకారం చేయాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఐఏఎస్ హితవు పలికారు. చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జేఎన్టీయూహెచ్ రెక్టార్ కె.విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి జ్యోతి వెలిగించి ఓరియంటేషన్‌ను ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గుగులోత్ నరసింహ అధ్యక్షతన జరిగిన సదస్సులో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి సమాజానికి, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు శైలజ, రజనీష్, సునీత, టీచింగ్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



నర్సాపూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరంగా యాత్ర

అమీన్‌పూర్/నర్సాపూర్/పాపన్నపేట, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హర్‌ఘర్ తిరంగా యాత్రకు మంచి స్పందన వస్తున్నదని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగాయాత్ర నిర్వహించారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగాయాత్రలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆగస్టు 15వ తేదీన ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకావిష్కరణ చేయాలని కోరారు. నర్సాపూర్‌లో తిరంగా యాత్రలో భాగంగా భారీ జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో జాతీయతా భావం పెంపొందించాలనే ఉద్దేశంతో తిరంగా యాత్ర చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంతోష్, ఓబీసీ మోర్చారాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు పాఠశాల నుంచి గ్రామంలోని పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం

చేగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల ద్వారా పొందిన రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది మరొకరికి ఆదర్శంగా ఉండాలని ఏపీఎం దుర్గాప్రసాద్ అన్నారు. చేగుంట, నార్సింగి, మండలాల్లో మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చేగుంట నుంచిబదిలీపై వెళ్లిన ఏపీఎం లక్ష్మీనర్సమ్మను ఏపీఎం దుర్గాప్రసాద్ తో పాటు మండల సమైక్య, గ్రామ సంఘాల సభ్యులు శాలువాతో సన్మానించారు.

● **నర్సాపూర్:** ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులనను చేయాలనే సంకల్పంతో ఉన్నందున సంఘాలలో లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మల్లేశం పేర్కొన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో మండల సమైఖ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.